క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎస్సై రామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న తదితరులు

సీతానగరం: ఎస్సై డి.రామ్‌కుమార్‌ను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, గుర్రాల కృష్ణారావు, మాకిరెడ్డి సాయి కళ్యాణ్ తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట రమణ

పెదపూడి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకట రమణ అన్నారు. ఈ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తీసుకునే ఆహారంలో కొర్రలు, జొన్నలు, గంట్లు, అంటుకొర్రలు, రాగులు, అరికలు చేర్చుకోవాలన్నారు. ఉప సర్పంచ్ మిరియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా గోతుల పూడ్చివేత



గోతులను పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

రాజానగరం: గ్రామంలోని పాత ఎస్‌హెచ్ రోడ్డుపై సినిమా థియేటర్ సమీపంలో పెద్ద గోతులు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు శుక్రవారం వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆర్అండ్‌బీకి చెందిన ఈ రోడ్డుపై సినిమా థియేటర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంతాలలో ఉన్న కల్వర్టులు (తూరలు) పూడుకుపోవడంతో ముంపు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ గోతులు పడటానికి కారణమవుతోంది. దీనితో ఆ గోతుల్లో క్వారీ బూడిద వేసి తాత్కాలికంగా పూడ్చుతున్నారు.

ఎమ్మెస్సార్ సేవలను కొనసాగిస్తాం



ఎమ్మెస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: మేడపాటి సీతారామరెడ్డి సేవలను కొనసాగిస్తామని ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సీతారామారెడ్డి 76వ జయంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ సీతారామరెడ్డి రాజమహేంద్రవరంలో అనేక దాతృత్వ కార్యక్రమాలు చేపట్టారన్నారు. టీటీడీ కల్యాణ మంటపం, ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్, సుబ్రహ్మణ్యం మైదానంలో ఆడిటోరియం, క్వారీ మార్కెట్ వద్ద గల శివాలయం ఆయన ఆధ్వర్యంలో నిర్మించారన్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో మేడపాటి అనిల్ రెడ్డి, ఎమ్మెస్సార్ ఫాలోవర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆనందా గార్డెన్స్‌లో శుక్రవారం వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ముగ్గురు పేద విద్యార్థులకు రూ.22 వేలు, 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలు అందజేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు కాసా జయప్రద, కొత్తపల్లి వీర్రాజు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, పూర్వ అధ్యక్షుడు సూరపరెడ్డి తాతారావు, క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు పాల్గొన్నారు.



కొంకుదురులో బాలగణపతి మంటపం సిద్ధం చేస్తున్న యువకులు



చంద్రేడు పాఠశాల హెచ్‌ఎం రమణబాబుకు వినాయక ప్రతిమ అందిస్తున్న విద్యార్థులు



పెదపూడిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి



బొబ్బిల్లంకలో మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు

జై జై గణేశా..

- వినాయక చవితికి సర్వం సిద్ధం
- కిటకిటలాడిన మార్కెట్లు
- పువ్వులు, పండ్లకు డిమాండ్

బిక్కవోలు: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలలో వినాయక చవితి సందడి నెలకొన్నాయి. శుక్రవారం నుంచి మొదలయ్యే గణపతి నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయి. వీధివీధినా గణనాథుడు కొలువుదీరనున్నాడు. ఈ నేపథ్యంలో పందిళ్ల ఏర్పాటులో కమిటీ సభ్యులు బిజీగా ఉన్నాయి. వినాయకవ్రతానికి పువ్వులు, పూజా సామగ్రి, ఇతర వస్తువులు విక్రయించే దుకాణాలు రద్దీగా మారాయి. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. ఎటు చూసినా గణపతి ప్రతిమలు, పత్రి విక్రయించే దుకాణాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో శుక్రవారం నాటికి సుమారు 345 మంటపాల ఏర్పాటుకు కమిటీలు దరఖాస్తు చేసుకున్నాయని అధికారులు తెలిపారు.

జోరుగా విగ్రహాల కొనుగోళ్లు

నియోజకవర్గంలో నవరాత్ర ఉత్సవాల కోసం గణపతి ప్రతిమలను కొనుగోలు చేయడానికి ఉత్సవ కమిటీలు ఉత్సాహంగా ముందుకు వచ్చాయి. గురువారం వరకు మందకొడిగా సాగిన విగ్రహాల అమ్మకాలు శుక్రవారం ఊపందుకున్నాయి. సుమారు 2 అడుగుల నుంచి 8 అడుగుల వరకూ సైజు ఉన్న విగ్రహాలను ఉత్సవ కమిటీలు కొనుగోలు చేశాయి. అయితే ఈ ఏడాది విగ్రహాల ధరల్లో కొంత పెరుగుదల కనిపించింది. విగ్రహాల సైజును బట్టి రూ.3 వేల నుంచి రూ.40 వేల వరకూ పలికాయి.

మట్టి ప్రతిమలే మేలు

రంగంపేట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించాలని ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు అన్నారు. చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు గుర్రం శిరిష, విజయలక్ష్మి మట్టి వినాయకుని ప్రతిమలు తయారుచేసి హెచ్‌ఎం రమణబాబుకు అందించారు. క్రాఫ్ట్ టీచర్ ఎస్. శ్రీలక్ష్మి ప్రోత్సాహంతో తాము ఈ మట్టి వినాయకుని తయారు చేశామని వారు తెలిపారు.

ప్రశాంతంగా వేడుకలు

పెదపూడి: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్, రెవెన్యూ, మత్స్యశాఖల అధికారులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.రామ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ రవిచంద్ర, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

బొబ్బిల్లంకలో విద్యార్థుల ర్యాలీ

సీతానగరం: మట్టి వినాయక ప్రతిమలను పూజించాలంటూ బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో వారందరూ విగ్రహాలను తయారు చేసి, గ్రామంలో పంపిణీ చేశారు. పర్యావరణహిత వినాయకుడిని పూజించాలని నినాదాలు చేశారు. సీతానగరం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, కమోర్డ్‌మెంట్ అవార్డు అందుకున్న అధ్యాపకుడు డి.నాగేశ్వరరావులను సహచర అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మట్టి గణపతి ప్రతిమలను తయారు చేసి అధ్యాపకులకు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి పాల్గొన్నారు.

లడ్డూలు రెడీ..

రాజానగరం: వినాయక చవితి ఉత్సవాలలో లడ్డూలకు ప్రత్యేకత ఉంటుంది. గణనాథుని విగ్రహాలను భారీగా నెలకొల్పడానికి నిర్వాహకులు ఏ విధంగా పోటీపడతారో, ఆ విగ్రహాల వద్ద ఉంచే లడ్డూ ప్రసాదాల విషయంలోను అదే విధంగా పోటీ పడతారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాజానగరంలోని శ్రీభక్తాంజనేయ స్వీట్ స్టాల్ యాజమాన్యం ఒక కిలో నుంచి 75 కిలోల వరకూ లడ్డూలను తయారు చేశారు.

పూజా సామగ్రి ధరకు రెక్కలు

రాజానగరం: వినాయక చవితి ప్రభావంతో మార్కెట్‌లో ఏ వస్తువును తాకినా షాక్ కొట్టే స్థాయిలో ధరలు పలుకుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. వినాయక చవితి అంటే హిందువులందరికీ ఎంతో ప్రీతికరమైన పండుగ. విఘ్నాలను హరించే విఘ్నేశ్వరుని భక్తితో పూజించి, ప్రసన్నం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు శక్తిమేరకు పూజ చేస్తుంటారు. దీనితో వినాయక చవితి పూజకు అవసరమైన సామాగ్రి రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా వివిధ రకాల పత్రి, పండ్లు, పువ్వులకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో ధరలను అమాంతం పెంచేశారు. ఆధునిక కాలంలో జన జీవనం కూడా యాంత్రీకమవడంతో బిజీ లైఫ్‌ని అనుభవిస్తున్న జనం వినాయక చవితికి అవసరమైన పూజా సామగ్రితో పాటు పత్రిని కూడా మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. మామిడి ఆకులతో కూడిన రెండు కొమ్మలు, ఉసిరి, రావి, ఇలా ఒకటో రెండో రకాల పత్రులకు సంబంధించిన కొమ్మలను కట్టలుగా కట్టి, మార్కెట్‌లో రూ.30 పైబడి విక్రయిస్తున్నారు. కలువ పువ్వు రూ.10, తామర పువ్వు రూ.20 పలుకుతున్నాయి. ఆపిల్, ఎలక్కాయలు, సీతాఫలం ఒక్కొక్కటీ దాదాపు రూ.20కి పైబడి విక్రయిస్తున్నారు.



రాజానగరంలో పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన జనాలతో కిక్కిరిసిన ప్రధాన రోడ్డు



దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో కొనుగోలుదారులు



రాజానగరంలోని ఓ స్వీట్‌షాపులో సిద్ధమైన లడ్డూలు

హడలెత్తిస్తున్న ధరలు



వినాయక చవితి అంటే ఎంతో ప్రీతికరమైన పండగ. దీనికి అవసరమైన పూజా సామగ్రికి మార్కెట్‌లో రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. అయినా ఏమి చేయగలం. ఉన్నంతలోనే కొనుగోలు చేస్తున్నాం.

– దుర్గాభవాని, రాజానగరం

అరకొరగా..



మా ఆదాయాలు పెరగడం లేదు గానీ మార్కెట్‌లో వస్తువులను ముఖ్యంగా పండుగల సమయంలో రేట్లు ఏటా పెంచేస్తున్నారు. ఒకప్పుడు వివిధ రకాల పండ్లను డజన్ చొప్పున కొనేవాళ్లం. కానీ ఇప్పుడు అమాంతం పెంచేస్తున్న ధరలతో అరకొరగా కొనుగోలు చేస్తున్నాం.

వై.ఏసుబాబు, జీఎస్ఎల్ క్యాంపస్

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం



సత్యసాయి గురుకులంలో మట్టి గణపతులతో విద్యార్థులు



లడ్డూలకు ప్రత్యేక అలంకరణ చేస్తున్న తయారీదారుడు



వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న చాంబర్ కార్యదర్శి మురళీకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దానిలో భాగంగానే మట్టి గణనాథుని ప్రతిమలతోనే వినాయక చవితి పర్వదినాన్ని జరుపుకోవాలని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య అన్నారు. గురుకులంలో శుక్రవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేస్తున్న విగ్రహాలతో నీటి వనరులు కలుషితం అవుతున్నాయన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ప్రతి ఏటా మట్టి గణపతి విగ్రహాలు విద్యార్థులతోనే చేయించి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 1200 వినాయక ప్రతిమలు పాఠశాల విద్యార్థులకు అందించారు.

- కాతేరులోని మల్లయ్యపేటలో జనసేన కార్యకర్తలు యోగేంద్ర, మణికంఠ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

కడియపులంకలో..

కడియం: కడియపులంక గామ దేవత మునలమ్మ అమ్మవారి ఆలయం వద్ద రాజానగరం ఐశ్వర్య రైస్ ఇండస్ట్రీస్ సమకూర్చిన 500 మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకథా పుస్తకాలు, 250 కుదుముల నూక ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

లడ్డూలకు అలంకరణ

రాజమహేంద్రవరం రూరల్: గణనాథుని విగ్రహాల చేతిలో పెట్టేందుకు అవసరమైన లడ్డూల తయారీ జోరుగా జరుగుతుంది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వీట్ షాపుల్లో ఆర్డరు ఇచ్చి వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఒక కేజీ దగ్గర నుంచి వంద కేజీల లడ్డూల వరకూ ఆర్డర్లు ఇస్తున్నారు. ఇలా తయారు చేసిన లడ్డూలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

మట్టి ప్రతిమలనే పూజించాలి

రాజమహేంద్రవరం సిటీ: మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సీపీ రెడ్డి ఆటో మొబైల్స్ షోరూమ్ వద్ద శుక్రవారం వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు పాల కృష్ణ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో 1200 వినాయక మట్టి ప్రతిమలను భక్తులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి, సెక్రటరీ ఉప్పల శ్రీను, జాయింట్ సెక్రటరీ బొదిరెడ్ల అప్పారావు రెడ్డి, ట్రెజరర్ సాయిబాబా, కొమ్మా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన జీవిత బీమా వారోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా వారోత్సవాలు అందరిలో స్ఫూర్తిని నింపాయని ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు మోరంపూడిలోని జీవిత బీమా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ముగింపు ఉత్సవాలలో ఆమె ప్రసంగించారు. వారం రోజుల పాటు జరిగిన వారోత్సవాలలో గిరిజన ప్రాంతాలలో నిత్యావసరాలు అందించడం చాలా ఆనందం కలిగించిందన్నారు. మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ బీమా వారోత్సవాలను విజయవంతం చేసిన ఎల్ఐసీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, గాత్రం, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్ఎం మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీ మేనేజర్ ప్రసాద్, డీపీ మేనేజర్ శ్రీనివాస్, ఆఫీస్ మేనేజ్మెంట్ మేనేజర్ కె.రేఖ పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎల్ఐసీ అధికారి సంధ్యారాణి

యువకుడికి తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం సిటీ: రైలు నుంచి దిగుతూ జారి పడటంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల విల్లా వినయ్ కృష్ణ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వస్తున్నాడు. స్టేషన్‌లో రైలు పూర్తిగా ఆగకుండానే దిగిపోవడంతో పడిపోయాడు. అతడికి నడుముకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు



మధురపూడి: విజయవాడ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, వలస వచ్చిన కుటుంబాలకు సదుపాయాలు కల్పించాలని కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో వలస కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయక చర్యలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

సీతానగరం: పురుషోత్తపట్నం శివారున పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.6,620 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన విజయ దుర్గమ్మకు భాద్రపద మాసం శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకం చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల తయారీపై పోటీ

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు మట్టి వినాయకుని విగ్రహాల తయారీపై శుక్రవారం పోటీ నిర్వహించారు. వాటి తయారీలో ప్రతిభ కనబర్చిన ముగ్గురిని విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జయానందకుమార్, డీన్ డాక్టర్ బి. శ్రీనివాసరాజు, డైరెక్టర్ డాక్టర్ కె. కుసుమకుమారి, ఎన్ఎస్ఎస్ పీఓ బి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

బిక్కవోలు: బలభద్రపురంలోని లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ నల్లమల్లి వెంకట సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం నిర్వహించి సమావేశంలో ప్రకటించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ లారీ ఓనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వేమగిరిలో వైద్యశిబిరం

కడియం: మండలంలోని వేమగిరిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 49 మందికి వైద్య పరీక్షలు చేయగా నలుగురు జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించినట్లు శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్నతెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రాజానగరం: యువత మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ, లక్ష్యాల సాధనకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీనియర్ కన్సల్టెంట్ హెచ్‌ఆర్ ఇన్ మైండ్ మేనేజ్మెంట్ వి.రవికుమార్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో సక్సెస్‌ఫుల్లీ విత్ గ్రూడ్ ఆఫ్ పీపుల్ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతీయ యువత పని చేసినంతగా మిగిలిన వారు ఎవ్వరూ కష్టపడలేరన్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తగిన నైపుణ్యాలు కూడా ఉండాలన్నారు.

ఆవ కాలువపై ఆక్రమణల తొలగింపు



చెరుకూరి గోడౌన్స్‌లో కాలువలో పడేందుకు సిద్ధంగా ఉన్న ఐరన్‌గదులు



ఆవ కాలువ వెంబడి ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలో ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం ఉదయం అధికారులు శ్రీకారం చుట్టారు. ఆవకాలువ ఆక్రమణల కారణంగా హుకుంపేట, బొమ్మూరులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్టు ఇటీవల కలెక్టర్ పి.ప్రశాంతి గమనించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్.లక్ష్మీరమ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు జేసీబీలతో ఆక్రమణలను తొలగించారు. ఎస్‌టీ ప్లాంట్ నుంచి బాలాజీపేట దుర్గగుడి వరకు ఉన్న ఆక్రమణలను తొలగించడానికి ప్రణాళిక సిద్ధమైంది. ముందుగా ఆవకాలువకు సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న షాపులను, జాతీయ రహదారి పక్కన ఆక్రమణలను తొలగించారు. ఆవకాలువ అటువైపు ఉన్న భవనాలు, ప్రహరీలు, చెట్లను కూడా తొలగించారు. పేదలు, వృద్ధులు నివసిస్తున్న ఇళ్లను కొద్ది రోజుల్లో ఖాళీ చేసి వేరొక చోటకు వెళ్లిపోవాలని లేనిపక్షంలో ఇళ్లను తొలగించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. జాతీయ రహదారి పక్కన ఉన్న సిద్దార్థ కాంపౌండ్‌లో ప్రహరీ, మరుగుదొడ్లు, మూడంతస్తుల భవనం ఆవకాలువపై ఆక్రమించుకుని నిర్మించారు. వాటిని తొలగించాలని సదరు యజమానికి ఆదేశాలు జారీ చేశారు. చెరుకూరి గోడౌన్స్‌లో వెనుక ప్రాంతంలో ఆవకాలువను ఆక్రమించుకోవడం జరిగింది. ఈ ఆక్రమణలో రిలయన్స్‌కు సంబంధించిన ఐరన్‌తో చేసిన గదులు సైతం కాలువలోకి ఒరిగి ఉన్నాయి. ఇవి కాలువలో పడితే రాజమహేంద్రవరం నగరం నుంచి వచ్చే నీరు ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇప్పటికే ప్రహరి కాలువలో పడిపోయింది. జాతీయ రహదారిపై ఉన్న సీతారామ టింబర్‌డిపో యాజమాన్యం కోరిక మేరకు ఆదివారం సాయంత్రం వరకు గడువు ఇచ్చారు. సోమవారం ఆక్రమణల తొలగింపు యథాతథంగా జరుగుతుందని అధికారులు తెలిపారు.